క్లుప్తంగా

ఘనంగా వేపారమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రమైన గుమ్మలక్ష్మీపురంలో వెలసిన గ్రామదేవత వేపారమ్మ తల్లి ఆలయంలో నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని గ్రామస్తులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ బి.గౌరీశంకరావు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులంతా ఆలయం వద్దకు పెద్ద ఎత్తున చేరుకొని, పంతులు రంపా రవిబాబు నేతృత్వంలో విగ్రహ ప్రతిష్ఠను చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామదేవత ఆశీస్సులు కోరుతూ గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. అన్నసమారాధన నిర్వహించారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా...



నృత్యాలతో అలరిస్తున్న విద్యార్థులు

పాలకొండ రూరల్: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకోవాలని రామా కళాశాల నిర్వహకులు వెంకటరమణ అన్నారు. శుక్రవారం కళాశాలలో ప్రెషర్స్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా అతిథులు, అధ్యాపకులు విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ తల్లితండ్రుల ఆశయాలను నెరవేర్చే దిశగా అడుగులు ముందుకు వేయాలన్నారు. సమాజంలో అత్యున్నత స్థానం విద్యతోనే సాధ్యమని అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉల్లాసంగా ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతర ఓటు హక్కుపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.

వ్యవసాయంలో డ్రోన్ల ఉపయోగం



డ్రోన్లు వాడకంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ

భామిని: వ్యవసాయంలో డ్రోన్లతో క్రిమి సంహారకాలు, ఎరువులు చల్లుకొనే ఆధునిక విధానాలు అమలులోకి వచ్చాయని ఎంపీడీఓ జె.ఉమామహేశ్వరి శుక్రవారం వివరించారు. భామినిలో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా రైతులకు డ్రోన్లు వాడకంపై అవగాహన కల్పించారు. 40 శాతం సబ్సిడీపై డ్రోన్లు కొనుగోలు చేసుకోవచ్చని వివరించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనం పొందవచ్చన్నారు. కార్యదర్శి విశ్వేశ్వరరావు, ఏఈలు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

న్యాయస్థానాలు అందరికీ సమానమే

పాలకొండ రూరల్: న్యాయస్థానాలు అందరికి సమానమేనని పాలకొండ జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి ఎ.విజయరాజకుమార్ అన్నారు. స్థానిక కోర్టు ప్రాంగణంలో న్యాయ విజ్ఞాన సదస్సు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ న్యాయం, చట్టం అందరికీ అందుబాట్లో ఉండేలా వ్యవస్థలు పని చేయాలన్నారు. క్షణికావేశంలో తీసుకున్న తప్పుడు నిర్ణయంతో కటకటాల పాలయ్యే ప్రమాదం ఉందన్నారు. చట్టాలపై అవగాహన పెంచుకోవటం వలన కలిగే ప్రయోజనాలు వివరించారు. న్యాయవాదుల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.సత్యంనాయుడు, ప్యానెల్ సభ్యులు ఎం.వెంకటేశ్వరరావు, కె.సూర్యనారాయణ, అల్లెన శివదాసు, ఎ.గోవిందరావు, కనపాక సూర్యప్రకాష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి

గరుగుబిల్లి: నాగూరులోవున్న శ్రీ చంద్రశేఖర స్వామి ఆలయ చైర్మన్‌గా వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కేతిరెడ్డి కూర్మినాయుడు శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. విశాఖపట్నం దేవదాయశాఖ డిప్యూటీ కమిషనర్ ఎస్.సుజాత ఉత్తర్వుల మేరకు ఆలయ చైర్మన్‌గా కూర్మినాయుడుచే దేవదాయ శాఖ సిబ్బంది మరిశర్ల బలరాంనాయుడు ప్రమాణ స్వీకారం చేయించారు. నూతనంగా చైర్మన్‌గా బాధ్యతలను స్వీకరించిన కూర్మినాయుడు మాట్లాడుతూ దాతలు, ప్రజాప్రతినిధులు, భక్తులు సహకారంతో ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యే పాముల పుష్పశ్రీవాణి, మన్యం జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు శత్రుచర్ల పరీక్షిత్ రాజు, ఎంపీపీ ఉరిటి రామారావు, జెడ్పీ వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడులకు కృతజ్ఞతలు తెలిపారు.



భామిని: చిన్నదిమిలిలో జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో సంక్షేమ పథకాల పట్టిక ఆవిష్కరిస్తున్న పార్టీ నాయకులు



కురుపాం: వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో గుంజరాడ సచివాలయ ఆవరణలో జెండాను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ, కార్యకర్తలు



కొమరాడ: చోళ్లపదంలో నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో నినాదాలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



గుమ్మలక్ష్మీపురం: దుమ్మంగిలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించిన ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

మళ్లీ జగనే సీఎం కావాలి

రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డే మళ్లీ ముఖ్యమంత్రి కావాలని పలువురు ప్రజాప్రతినిధులు పేర్కొన్నారు. జగన్ పాలనలోనే సంక్షేమం, అభివృద్ధి సమపాళ్లలో జరుగుతుందన్నారు. దీన్ని ప్రజలంతా గుర్తించి వచ్చే ఎన్నికల్లో కూడా జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ఆశీర్వదించాలని అన్నారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం పలుచోట్ల శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమాల్లో పార్టీ శ్రేణులు ప్రజల్లోకి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో జరిగిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఆయా కార్యక్రమాల్లో అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



వీరఘట్టం: మండలం చలివేంద్రిలో ఏపీకి జగనే ఎందుకు సీఎం కావాలి కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ దమలపాటి, పక్కన పార్టీ నేతలు

పకడ్బందీగా ప్రత్యేక ఓటరు నమోదు : ఆర్‌డీఓ

గుమ్మలక్ష్మీపురం: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు డిసెంబర్ 2, 3 తేదీలలో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని పాలకొండ ఆర్‌డీఓ ఎం.లావణ్య అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో బీఎల్వోలతో ఆమె శుక్రవారం సమావేశం నిర్వహించారు. ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమంపై బీఎల్వోలకు అవగాహన కల్పించారు. ఓటరు నమోదు కార్యక్రమంలో కొత్త ఓటర్ల నుంచి ఫారం -6లను స్వీకరించడంతో పాటు ఇంటింటికి వెళ్లి ఎవరైనా చనిపోయిన ఓటర్లు ఉన్నట్లు గుర్తిస్తే వారి పేర్లను తొలగించాలని సూచించారు. ఓటు ఉందో లేదో అనే సందేహంతో వచ్చే ఓటర్లెవరైనా ఉంటే వారి సందేహాలు నివృత్తి చేయాలంటూ పలు సూచనలు చేశారు. ఆమె వెంట తహసీల్దార్ జె.రాములమ్మ ఉన్నారు.

అర్హులంతా ఓటరుగా నమోదు కావాలి

గుమ్మలక్ష్మీపురం: భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును 18 ఏళ్లు నిండిన వారంతా కలిగి ఉండాలని తహసీల్దార్ జె.రాములమ్మ అన్నారు. గుమ్మలక్ష్మీపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఓటు హక్కుపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఓటు హక్కు లేని వారెవరైనా ఉంటే ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు శని, ఆదివారాల్లో అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద నిర్వహించే ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ టి.శ్రీవరం, వైస్ ప్రిన్సిపాల్ డి.రామయ్య, ఎన్ఎస్ఎస్ పీఓ బి.త్రినాథ్, అధ్యాపకులతో పాటు ఉప తహసీల్దార్ ఎం.రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక ఓటరు నమోదుపై సూచనలు చేస్తున్న ఆర్‌డీఓ లావణ్య



గరుగుబిల్లి: ఓటు హక్కు నమోదుపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది



విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్

ఓటరుగా నమోదు చేసుకోవాలి

గరుగుబిల్లి: జనవరి 1 నాటికి 18ఏళ్లు నిండిన వారు ఓటు హక్కును నమోదు చేసుకోవాలని మండల తహసీల్దార్ జీవీ జనార్ధన్ పేర్కొన్నారు. మండలంలోని ఉల్లిభద్రలోని డా.వైఎస్సార్ ఉద్యాన కళాశాల విద్యార్థులతో ఓటు హక్కు నమోదుపై అవగాహనను శుక్రవారం కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్తు యువతపై ఆధారపడి ఉందన్నారు. ఓటు హక్కును నమోదు చేసుకోవడంతో పాటు ఓటు హక్కును ఎన్నికల్లో వినియోగించుకొని మంచి నాయకుడ్ని ఎన్నుకోవాలన్నారు. ఈ నెల 2, 3 తేదీల్లో నిర్వహించనున్న ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమంలో ఓటు హక్కును నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో డీటీ పి.లక్ష్మీకుమార్, ఎంఈఓ ఎన్.నాగభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన



ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న పీఓ కల్పనాకుమారి

సీతంపేట: సీతంపేటలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కల్పనాకుమారి ఆధ్వర్యంలో ఈవీఎంలపై ఓటు హక్కు ఎలా వినియోగించుకోవాలనేది శుక్రవారం అవగాహన కల్పించారు. వీటి ద్వారా ఓటు వేసేటపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఓటు వేసిన తర్వాత మీరు వేసిన గుర్తుకే ఓటు నమోదు అయ్యిందా లేదా అనేది కూడా చూడవచ్చన్నారు. మాక్ పోలింగ్ నిర్వహించారు. అనంతరం ఓటుపై అవగాహన చేయడానికి వెళ్లే వాహనాన్ని పీఓ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరసింహమూర్తి, ఎంపీడీఓ గీతాంజలి, ఆర్ఐ వెంకటేష్, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మారు మోగిన అయ్యప్ప నామస్మరణ

పాలకొండ: హరహర సుతుడు అయ్యప్ప స్వామి దీక్షలు చివరి దశ చేరుకున్న నేపథ్యంలో శుక్రవారం పట్టణంలో అయ్యస్వామి దీక్ష తీసుకున్న భక్తులు పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. పట్టణానికి చెందిన ఆధ్యాత్మిక వేత్త పల్లా కొండలరావు పట్టణంలోని అయ్యప్ప, శివస్వాములు, భవాని దీక్షలు తీసుకున్న వారికి అన్న సంతర్పణ చేశారు. గురు స్వాములను సన్మానించారు. హిందు ధార్మిక సంస్థల ప్రచార కర్తలు మూర్తి గురుస్వామి, రుద్రస్వామి, శంకరరావు గురు స్వాముల ఆధ్వర్యంలో పడి పూజలు జరిపించారు. వందలాదిగా దీక్షలు తీసుకున్న భక్తులు అయ్యప్ప నామస్మరణతో పట్టణంలో సందడి చేశారు.



గురు స్వాములను సన్మానిస్తున్న కొండలరావు

ప్రతీ జాబ్‌కార్డుకు 100 రోజుల పని కల్పించండి

● ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

వీరఘట్టం: ఉపాధి హామీ పథకంలో జాబ్‌కార్డులు ఉన్న వారందరికీ 100 రోజుల పనిదినాలు కల్పించాలని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. శుక్రవారం వండవలో నిర్వహించిన ఉపాధిహామీ పథకంలో చేపట్టనున్న 100 రోజుల ప్రణాళిక గ్రామ సభలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. గ్రామ ప్రజలకు, ముఖ్యంగా రైతులకు ఉపయోగపడేలా ఉపాధి పనులు చేపట్టాలని అందుకు అనుగుణంగా చేపట్టాలని సూచించారు. పంట కాల్వలను బాగు చేయించాలన్నారు. అంతకు ముందు 100 రోజుల ఉపాధి హామీ ప్రణాళిక మ్యాప్‌ను ఉపాధిహామీ ఏపీఓ సత్యంనాయుడు వివరించారు. మొత్తం ఏడాదిలో ప్రతీ నెలా కల్పించనున్న పనులను వారు ఎమ్మెల్యే కళావతికి తెలిపారు. గ్రామ సర్పంచ్ మిడితాన కళ్యాణి, గ్రామస్తులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.



వండవలో గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావతి

ఆడుదాం.. ఆంధ్రా లోగో ఆవిష్కరణ



లోగో ఆవిష్కరిస్తున్న పీఓ కల్పనాకుమారి

సీతంపేట: ఆడుదాం ఆంధ్రా లోగోను ఐటీడీఏ పీఓ కల్పనాకుమారి శుక్రవారం ఐటీడీఏలో ఆవిష్కరించారు. ఈ నెల 15 నుంచి జరగనున్న క్రీడల్లో ప్రతీ ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలన్నారు. గ్రామ సచివాలయ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో జరిగే క్రీడా పోటీలకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎస్‌డీఓ వెంకటేశ్వర్లు, ఐటీడీఏ స్పోర్ట్స్ ఇన్‌చార్జి జాకబ్ దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

సారా పట్టివేత

సీతంపేట: మండలంలోని చిన్నబగ్గకాలనీ పరిధిలో 80 లీటర్ల సారా పట్టుకున్నట్టు ఏఎస్ఐ సంజీవ్ తెలిపారు. సారాను అక్రమంగా తరలిస్తున్న తోటయ్యను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

క్రీడాకారులకు అభినందనలు

పాలకొండ రూరల్: చదువులతో పాటు క్రీడల్లో సత్తా చాటాలని భాసూరు సర్పంచ్ శిర్లాపు గురువినాయుడు అన్నారు. తమ గ్రామ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన కబడ్డీ క్రీడాకారిణిలను శుక్రవారం హెచ్ఎం వి.వైకుంఠరావుతో కలసి సన్మానించారు. ఇటీవల రాష్ట్ర స్థాయి అండర్-14 కబడ్డీ పోటీల్లో విద్యార్థినిలు బంగారు పతకం సాధించటం పట్ల హర్షం వ్యక్తం చేసారు. క్రీడాకారిణిలు అలజంగి చాందిని, ముంజేటి హేమ, తేజ తదితరులకు రూ.5వేలు వంతున ముంజేటి రామారావు నగదు ప్రోత్సాహం అందించారు. గణిత టేలెంట్ టెస్టులో ప్రతిభ కనబర్చిన సీహెచ్ సలోమియా, సైన్స్ విభాగంలో కె.లోహితకు రూ.వెయ్యి పారితోషికాన్ని అందించారు.

నేడు, రేపు ప్రత్యేక ఓటరు నమోదు

వీరఘట్టం: మండల వ్యాప్తంగా అన్ని పోలింగ్ బూత్‌ల వద్ద శని, ఆదివారాల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు తహసీల్దార్ చందక సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్‌ఓలు విధిగా ఉండాలని తెలిపారు. అర్హులంతా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

'ఆడుదాం ఆంధ్రాతో' ప్రతిభావంతులకు సదవకాశం

వీరఘట్టం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకం నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్రా క్రీడలను ప్రతిభావంతులైన క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి పేర్కొన్నారు. ఈ నెల 15 నుంచి ప్రారంభం కానున్న ఆడుదాం ఆంధ్రా క్రీడల లోగో, ఈ క్రీడల్లో విజేతలకు ఇవ్వనున్న బహుమతులను శుక్రవారం వండవ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కళావతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కళావతి మాట్లాడారు. క్రీడల ద్వారా ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడం, ప్రతిభావంతులైన క్రీడాకారులను ఈ వేదిక ద్వారా దేశానికి పరిచయం చేయడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. 15 ఏళ్లు నిండిన స్త్రీ, పురుషులు తమ పేర్లు తమ సచివాలయాల్లో నమోదు చేసుకోవాలని లేదా 1902 నంబర్‌కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని జిల్లా స్పోర్ట్స్ అథారటీ అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్కూల్ గేమ్స్ సెక్రటరీ డీ.టీ గాంధీ, నియోజక, మండల క్రీడా ఇన్‌చార్జ్‌లు పుష్పనాథం, రాములు, పాలకొండ నగర పంచాయతీ కౌన్సిలర్ పల్లా భాను, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వండవ క్యాంపు కార్యాలయం వద్ద ఆడుదాం ఆంధ్రా లోగో ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కళావతి

నిర్మాణాల వేగవంతంపై దృష్టి పెట్టండి

పాలకొండ రూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న గృహ నిర్మాణాలు గ్రామీణ ప్రాంతాల్లో సకాలంలో పూర్తి జరిగేలా అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్లాలని ఎంపీడీఓ డొంక త్రినాథులు అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో మండల పరిధిలో సచివాలయాల అడ్మిన్ సెక్రటరీలు, గృహ నిర్మాణ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల వ్యాప్తంగా మంజూరైన గృహాల సంఖ్య, పంచాయతీల వారీగా నిర్మాణాల తాజా స్థితిగతులపై సమీక్ష చేపట్టారు. హౌసింగ్ ఏఈ మాధవరావు మాట్లాడుతూ లబ్ధిదారుల వివరాలు, ఇప్పటివరకూ చెల్లించిన హౌసింగ్ బిల్లులు, లబ్ధిదారులు అందిస్తున్న ఫిర్యాదులు ఎంపీడీఓ దృష్టికి తీసుకువచ్చారు.



సచివాలయ, హౌసింగ్ సిబ్బంది సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ త్రినాథులు

వేగవంతంగా గృహ నిర్మాణాలు

వీరఘట్టం: మండల వ్యాప్తంగా జగనన్న గృహ నిర్మాణ పథకంలో భాగంగా చేపడుతున్న ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తయ్యేలా ఇంజినీరింగ్ అసిస్టెంట్లు లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ వై.వెంకటరమణ సూచించారు. హౌసింగ్‌పై ఇంజనీరింగ్ అధికారులతో ఆయన శుక్రవారం సమీక్ష నిర్వహించారు. మండలంలోని 11 సచివాలయాల పరిధిలో చేపడుతున్న 217 ఇళ్ల నిర్మాణాలు 2024 జనవరి నెలాఖరుకు పూర్తయ్యేలా చూడాలన్నారు. ప్రభుత్వ లక్ష్యాలను చేరుకునేందుకు అందరూ సమన్వయంతో పని చేయాలని సూచించారు. సమావేశంలో హౌసింగ్ ఏఈ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

గరుగుబిల్లి: ప్రభుత్వం మంజూరు చేస్తున్న పథకాలను లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్ అన్నారు. మండలంలోని పెద్దూరులో పీఎంఈజీపీ పథకంలో గ్రామైక్య సంఘం ద్వారా మంజూరు చేసిన వరి నూర్పిడి యంత్రాన్ని ఆయన శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామైక్య సంఘ సభ్యులకు, రైతులకు ప్రభుత్వం పలు పథకాలను మంజూరు చేస్తుందన్నారు. పథకాలను సక్రమంగా నిర్వహణ చేసి ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. మండలంలో దళాయివలస గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో వెల్డింగ్ యూనిట్‌ను మంజూరు చేయడం జరిగిందన్నారు. సుంకి గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో స్వీట్ దుకాణం ఏర్పాటుకు రూ.5లక్షలు రుణాన్ని మంజూరు చేయడం జరిగిందన్నారు. గొట్టివలస గ్రామైక్య సంఘానికి టైలరింగ్ యూనిట్‌ను మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో డీపీఎం ప్రవీణ్ కుమార్, ఏపీఎం పి.అప్పలనాయుడు, సీసీలు గ్రామైక్య సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



నూర్పిడి యంత్రాన్ని ప్రారంభిస్తున్న పీడీ కిరణ్‌కుమార్

రంచన్‌గా పింఛన్

ఒకటో తేదీ వచ్చిందంటే పింఛన్‌దారుల్లో ఎనలేని ఆనందం. ఆ ఆనందం నిలిచేలా శుక్రవారం వేకువజామునే వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి పింఛన్ లబ్ధిదారులకు సొమ్మును అందజేశారు. దీంతో మా బిడ్డ జగనన్న పంపిన డబ్బులు తమకు అందాయని లబ్ధిదారులు సంబరపడుతున్నారు. పింఛన్ డబ్బులు అందడంతో అంతటా సందడి వాతావరణం నెలకొంది. - సాక్షి నెట్‌వర్క్



కురుపాం: గౌడువీధికి చెందిన వృద్ధురాలు మంచానికే పరిమితం కావడంతో ఆమె వద్దకు వెళ్లి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ కోన ఆశశ్రీ



భామిని:నేరడి-బిలో తెలవారుతుండగానే వృద్ధురాలు ఆదమ్మకు పింఛన్ కోసం వేలిముద్ర తీసుకొంటున్న వలంటీర్ ఉపేంద్ర



వీరఘట్టం: కత్తులకవిటిలో ఓ వృద్ధురాలికి శుక్రవారం తెల్లవారుజామున పింఛన్ అందజేస్తున్న వలంటీరు భవానీ

4న సామూహిక సెలవు

గరుగుబిల్లి: పార్వతీపురం కలెక్టరేట్ వద్ద ఈ నెల 4న జరగనున్న ఆవేదన దీక్షలో పాల్గొంటామని ఆ రోజు విధులకు హాజరు కాలేమని సామూహిక సెలవుగా తెలుపుతూ ఎంఈఓ 2 కొండలరావుకు ఎంఆర్‌సీ సిబ్బంది శుక్రవారం నోటీసు అందజేశారు. సోమవారం 6వ తరగతి నుంచి 10 వరకు ఎస్ఏ ప్రశ్నపత్రాలు ఎంఆర్‌సీ నుంచి పొందేందుకు ఆల్టానెట్ సౌకర్యం ఏర్పాటు చేసుకోవాలని ఆ నోటీసులో కోరారు. సీఆర్‌పీలు, ఎల్‌డీఏ, ఎంఐఎస్, ఐఈఆర్‌పీ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా పలుచోట్ల ర్యాలీలు శుక్రవారం నిర్వహించారు. వైద్య శాఖ సిబ్బంది, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు ర్యాలీల్లో పాల్గొన్నారు. ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పలువురు వక్తలు పేర్కొన్నారు.

- సాక్షి నెట్‌వర్క్



కురుపాం: ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



సీతంపేట: హడ్డుబంగి ఆశ్రమ పాఠశాలలో రెడ్ రిబ్బన్ ఆకారంలో విద్యార్థినులు



గుమ్మలక్ష్మీపురం: తాడికొండ గ్రామంలో ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది



వీరఘట్టం: ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా మానవహారం కట్టి నినాదాలు చేస్తున్న వీరఘట్టం జీజేసీ విద్యార్థులు